క్లుప్తంగా

ఉద్యోగాల భర్తీకి డిమాండ్



బ్యాంకు వద్ద ప్లకార్డులతో ఉద్యోగుల నిరసన

సీతమ్మధార : బ్యాంకులో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ సీతమ్మధారలోని యూనియన్ బ్యాంకు వద్ద ట్విట్టర్ క్యాంపెయిన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆల్ ఇండియా బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్. వసంతరావు మాట్లాడుతూ బ్యాంకులో ఔట్‌సోర్సింగ్ పద్ధతిని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం నేడు

సీతమ్మధార : సోమవారం 24వ వార్డులోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ తాగునీటి విభాగం కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ద్వారకానగర్ 4వ లైన్, టీఎస్ఆర్ బ్లాక్–6, 7 రిజర్వాయర్‌కి మంచినీరు సరఫరా చేసే జీఆర్‌పీ పంపింగ్ ప్రధాన పైపులైన్ మరమ్మతుల కారణంగా చైతన్యనగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



పోటీలకు ఎంపికైన జట్టు, కోచ్‌లు

సీతమ్మధార: ది ఆంధ్రా బాడీ బిల్డర్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న భీమవరంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక మజిల్ ప్లానెట్ జిమ్‌లో ఆదివారం జరిగింది. ముఖ్య అతిథులుగా ది ఆంధ్రా బాడీ బిల్డర్స్ సంఘం అధ్యక్షుడు రాజారావు, ప్రధాన కార్యదర్శి బి.కోటిరెడ్డి హాజరై 30 మందితో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు చిన్నబాబు, విజయ్‌రెడ్డి, సురేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'సాధు శతకం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

సీతంపేట: పి.ఎల్.వి.ప్రసాద్ రచించిన 'సాధు శతకం' పుస్తకావిష్కరణ సభ అమరావతి విశ్వ సాహితి ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. ప్రముఖ పద్య కవి సిహెచ్.చినసూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ముఖ్య అతిథిగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూటికుప్పల మాట్లాడుతూ సరళంగా ప్రసాద్ రాసిన రచనా శైలిని అభినందించారు. పుస్తక సమీక్ష చేసిన డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ ప్రసాద్ శతక పద్యాల వైశిష్ట్యాన్ని సభకు వివరించారు.

కొమరం భీమ్‌కు ఘన నివాళి

పెదగంట్యాడ: గిరిజనోద్యమ నాయకుడు కొమరం భీమ్ సేవలు మరువలేమని జిల్లా మహాబోధి సొసైటీ సభ్యుడు బోర వేణు గోపాల్ గౌతమ్ అన్నారు. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని పెదగంట్యాడ కూడలిలో కొమరం భీమ్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భీమ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ విముక్తి కోసం నిజాం సర్కారు నవాబుపై గెరిల్లా పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాటాలు చేశారని తెలిపారు.



త్రిలోక జననీ.. పరమానంద రూపిణీ

దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని దుర్గమ్మవారు పలు రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. మహిళలు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేస్తున్నారు. దుర్గా మండపాల వద్ద ఏర్పాటు చేస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి.

- అంతటా వెల్లివిరుస్తున్న దసరా శోభ
- అమ్మవారికి భక్తుల ప్రత్యేక పూజలు, అభిషేకాలు



మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన శ్రీ దుర్గాలమ్మ

సీతంపేట/కంచరపాలెం/సీతమ్మధార/తాటిచెట్లపాలెం/మురళీనగర్ : దుర్గాష్టమి సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో అమ్మవారు మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా మహా సౌరం, అరుణ హోమాలు నిర్వహించారు. సోమవారం రాజరాజేశ్వరి అలంకరణలో అమ్మవారు దర్శనం ఇస్తారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

దుర్గాదేవిగా పార్వతీదేవి..
సీతంపేట పార్వతీశ్వరాలయంలోని పార్వతీదేవి ఆదివారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శివాజీశర్మ, భాస్కరశర్మ పర్యవేక్షణలో లలితా సహస్ర నామార్చన, ఖడ్గమాలార్చన, గాయత్రి నామార్చన, చండీ హోమం, అమ్మవారి శ్రీచక్ర మేరువులకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

సామూహిక కుంకుమ పూజలు..
రెడ్డికంచరపాలెం జాషువానగర్ ప్రసన్న వినాయక కనకదుర్గ ఆలయంలో ఆదివారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ప్రధాన అర్చకులు వరాహగిరి వెంకట జగన్నాథం జరిపారు. అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. గుమ్మడి అప్పలరాజు భక్తులకు అన్నసమారాధన చేశారు. గొట్టివాడ నర్సింగరావు, అలమండ ప్రసాద్, గుమ్మిడి ఆదినారాయణ మూర్తి, అచ్చిబాబు నేతృత్వంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుమ్మిడి వాసు, అలమండ కళావతి, కోరి మల్లేశ్వరి, సీహెచ్ ఉష, ఉప్పాడ పార్వతి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన..
వెంకటేశ్వర కళా సమితి ఆధ్వర్యంలో దొండపర్తి మండా వారి పేటలో ఆదివారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. కమిటీ సభ్యులు మద్ది శ్రీనివాసరెడ్డి, గండిబోయిన వంశీ రాము, ఆర్. శ్రీనివాసరెడ్డి, అల్లూరి అప్పలరెడ్డి, సంగం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీలలితాపీఠంలో మహిషాసుర మర్దిని అలంకరణలో శ్రీలలితాదేవి



చండికాదేవిగా లలితాంబిక

దుర్గాదేవికి దీపారాధన..
రాధాకృష్ణ రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక రాధాకృష్ణ ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం దీపారాధన నిర్వహించారు. మండపం వద్ద రంగు రంగుల ఉప్పుతో దుర్గాదేవి చిత్రాన్ని చూడముచ్చటగా తీర్చిదిద్ది చుట్టూ ప్రమిదల్లో దీపాలు వెలిగించారు. సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై దీపారాధనను ప్రారంభించారు. భీమవరపు శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు దేవర రామకృష్ణ, బోర చిన్న, దుక్క అప్పన్న, తోనంగి లక్ష్మణరావు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కనకమ్మ వీధిలో అన్నసమారాధన
దుర్గా నవరాత్రి మహోత్సవాలలో భాగంగా జీవీఎంసీ 25వ వార్డు కనకమ్మవారి వీధిలో కనకమ్మ యూత్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సారిపిల్లి గంగరాజు, పోతిబంతి హరికృష్ణ, బోరా శ్రీను, కొండబాబు, కోడిదాసు సూరిబాబు, భాస్కరరావు, శివాజీబాబు,

సత్యసాయినగర్‌లో..
జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతం సత్యసాయినగర్‌లో గల విజయదుర్గాదేవి ఆలయంలో నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ మహోత్సవాలలో భాగంగా ఆదివారం గ్రామ అధ్యక్షుడు కారుకొండ రాజు, గ్రామ కమిటీ సభ్యులు, మహిళల ఆధ్వర్యంలో గ్రామంలో గల ఆడపిల్లలతో ప్రత్యేకంగా కుమారి పూజలు నిర్వహించారు. ఈ పూజలో అధిక సంఖ్యలో ఆడపిల్లలు, మహిళలు పాల్గొన్నారు. ప్రతిరోజు కుంకుమపూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు.



కనకమ్మ వీధిలో అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తదితరులు



అన్నదానం ప్రారంభిస్తున్న అల్లు శంకరరావు

మహాలక్ష్మిగా శ్రీ దుర్గాలమ్మ..
నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రుల సందర్భంగా శనివారం దుర్గాలమ్మ అమ్మవారు మహాలక్ష్మి అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం 6 గంటల నుంచి దేవాలయంలో శ్రీ దుర్గా హోమం, అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో శ్రీమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు.

చండికాదేవి అవతారంలో లలితాదేవి..
లలితాదేవి ఆలయంలో ఆదివారం చండీ యాగం నిర్వహించారు. దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారిని చండికాదేవిగా అలంకరించారు. అమ్మవారికి పులిహోర నైవేద్యంగా సమర్పించారు. వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు శేషాచార్యులు పాల్గొని దుర్గ సప్తశతి వివరించారు. లలితాదేవి అమ్మవారి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. ఆలయ అధ్యక్షుడు టీఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సనపల వరప్రసాద్, ఆలయ అర్చకుడు రామశాస్త్రి, ప్రసాదశర్మ, భానుమూర్తి పాల్గొన్నారు.

పట్టాభిరెడ్డితోటలో అన్నదానం..
పట్టాభిరెడ్డితోటలో విద్యాలక్ష్మీగణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 49వ వార్డు కార్పొరేటరు అల్లు శంకరరావు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.శ్రీను, ఎస్.శ్రీను, పి.చైతన్య, సీహెచ్.శ్రీను, కిషోర్ పాల్గొన్నారు.



మురళీనగర్ లలితా దేవి ఆలయంలో చండీ హోమంలో పాల్గొన్న భక్తులు



రెడ్డికంచరపాలెం జాషువానగర్ ప్రసన్న వినాయక కనకదుర్గ ఆలయంలో కుంకుమ పూజల్లో మహిళలు



సీతంపేటలో దుర్గాదేవి మండపం వద్ద దీపారాధన



దొండపర్తి మండా వారి పేటలో భక్తులకు అన్నసమారాధన చేస్తున్న నిర్వాహకులు

రంగనాథస్వామి అలంకరణలో శ్రీవారు

సీతమ్మధార: మహాగణపతి ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, శ్రీషిర్డీసాయిబాబా ఆలయంలో దేవీ నవరాత్రులు, ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం రంగనాథ్‌స్వామి అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటలకు దుర్గా హోమం, మహాలక్ష్మి దుర్గా అమ్మవారికి అభిషేకాలు చేశారు. ప్రధానార్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం శ్రీవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు తిరువీధి జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వనజాక్షి, శివ తదితరులు పాల్గొన్నారు.



రంగనాథస్వామి అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి

తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మళ్లీ ఎటువంటి నేరాలకు పాల్పడకుండా కుటుంబ సభ్యులతో హాయిగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు పోలీసు నిఘా ఉంటుందన్నారు. పలు హత్య కేసుల్లో ఉన్న నిందితులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం వేలిముద్రలు సేకరించారు.

- ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు సీఐ సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. అల్లర్లకు పాల్పడవద్దని హెచ్చరించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇంటి వద్ద అప్పగించారు.



పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విజయకుమార్

విస్తృతంగా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

మద్దిలపాలెం: పిఠాపురం కాలనీలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ఆదికర్త శ్రీఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 100 రకాల పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవ సమితి సభ్యుడు రావణ అక్షయ మాట్లాడుతూ దసరా అంటే పదింటిని నాశనం చేసేదని అర్థమన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన ప్రబోధ సేవా కమిటీ సభ్యులు 30 మంది పాల్గొన్నారు.



పిఠాపురం కాలనీలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న బొద్దాం కమిటీ సభ్యులు

'యుధిష్టర్' పోస్టర్ ఆవిష్కరణ

సీతంపేట : జె.కె.క్రియేషన్స్ పతాకంపై నూతన తారాగణంతో స్థానిక కళాకారులతో నిర్మించిన యుధిష్టర్ చిత్రం పోస్టర్, టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. ఏపీ మూవీ ఆర్టిస్ట్స్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు దాడి సత్యనారాయణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నటులు సత్యప్రసాద్, దర్శకుడు యశ్వంత్ గొలుసుల, నిర్మాత కందుకూరి ప్రేమ్‌కుమార్, సహ నిర్మాత హరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవుని సన్నిధిలో ధర్మ ప్రచారోత్సవాలు ప్రారంభం

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో దసరా సందర్భంగా ధర్మ ప్రచారోత్సవాలు ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో అర్చకుడు శేషాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్ క్యాప్ చైర్మన్ కేకే రాజు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మావతి అమ్మవారికి కేకే రాజు కుంకుమ సమర్పించారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం కలశస్థాపన, సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ సభ్యులు మధుమోహన్, బంగార్రాజు, విశ్వస్వరూప్, సురేష్, పరశురాములు. శ్రీరాములు, ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ కమిటీ సభ్యులు రామచంద్రరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పద్మావతి అమ్మవారికి కుంకుమ సర్పిస్తున్న కేకే రాజు

'ధూమపానం హీరోయిజం కాదు'

టీచ్ రోడ్డు: జీవితాలను అనారోగ్యం పాలు చేసే ధూమపానాన్ని హీరోయిజంగా సినిమాల్లో చూపించడం తగదని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. ఆదివారం ధూమపానంపై వినియోగదారుల హక్కుల సంస్థ ఆధ్వర్యంలో వైఎంసీఏ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎల్ మాట్లాడుతూ పొగ తాగడంపై ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ధూమపానం మానేసిన పలువురిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు నవీన్ ప్రకాశ్‌శర్మ, రాష్ట్ర అధ్యక్షుడు గొర్లె శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహారావు